అందుబాటులో పశుగ్రాస విత్తనాలు

విశాలాంధ్ర - కే.కోటపాడు: రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. 280 కిలోల కాకి జొన్న, 735 కిలోల మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐదు కిలోల కాకి జొన్న రాయితీ పోను 115 రూపాయలు, మొక్కజొన్న రాయితీ పోను ఐదు కేజీలు 85 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. పశువులకు ఈ గ్రాసం ఎంతో బలవర్ధకమైన ఆహారమని అన్నారు. రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని అన్నారు.

గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే....!

- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కనిపిస్తున్నా ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మండల స్థాయిలో అధికారులు మాత్రం వారానికి స్పెషల్ డ్రైవ్ పేరుతో సమావేశాలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామాల్లో రోడ్ల పక్కన ఉన్న చెత్తను చూస్తే అర్థమవుతుంది. ప్రజలు నివాసం ఉండే ప్రదేశాల్లో చెత్తను తీసుకొచ్చి వేయడంతో రోగాల బారిన పడుతున్నామని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తాము

నివాసం ఉన్నచోట చెత్తను తొలగించాలని, మురికి కాలువలను శుభ్రం చేయాలని ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అరట్లకోట, మంగవరం గ్రామాల్లో నెలలు తరబడి చెత్తను తొలగించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకురావడం లేదు. దీంతో గ్రామాలలో చెత్త పేరుకుపోయి ఉంటుంది. చెత్తను తొలగించే

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతోపాటు ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు.

పంటను డైరెక్టుగా అమ్ముకునే విధానం ద్వారా రైతులకు మేలు

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పండించే రైతులు తమ పంటను డైరెక్టుగా అమ్ముకునే విధానం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు డిస్ట్రిక్ట్ లెవెల్ మోనటరింగ్ కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో గల వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో, రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలతో పాటు రైతు పండించిన పంటను స్టోరేజ్ చేసే అవకాశాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధిక లాభాలు వచ్చే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళారీ వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డ్, హార్టికల్చర్, అగ్రికల్చర్, డిఆర్ డిఎ, ఫిషరీస్ శాఖల అధికారులు, ఎల్.డి.ఎమ్., వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కళ్యాణపులోవ రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రావికమతం: కళ్యాణపు లోవ రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమణారావు ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో రిజర్వాయర్‌ను శుక్రవారం తహశీల్దార్ రమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ ఏఈ సత్యనారా యణ దొరను ప్రస్తుతం రిజర్వాయర్‌లోని నీటి పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 460 అడుగులు కాగా ప్రస్తుతం 458.80 అడుగుల వద్దకు నీటిమట్టం చేరుకుందన్నారు. ఇన్ ఫ్లో 100 క్యూసెక్కులు ఉందని ఏఈ వివరించారు. వర్ష తీవ్రత ఎక్కువైన పక్షంలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని సమీక్షించాలని సూచించారు. ప్రమాద స్థాయికి చేరుకున్న ఎడల రిజర్వాయర్ గేట్లు ఎత్తి నదిలోకి నీరు విడుదల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గొడగలి కులస్తులు కుల ధ్రువీకరణకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - రావికమతం: గొడగలి కులస్తులు కుల ధ్రువీకరణ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ రమణారావు తెలిపారు. ఎస్సీ సబ్ కాస్ట్ అయిన గొడగలి కులస్తులు కుల ధ్రువీకరణ కోసం ఆన్లైన్లో దరఖాస్తు ఆప్షన్ లేకపోవడంపై ఈనెల 12న మండలంలో కొత్తకోటకు చెందిన ఈ కులస్తులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. 2023 వరకు రావికమతం తహశీల్దార్ కుల ధ్రువీకరణాలు జారీ చేశారని వీటిని రెన్యూవల్‌కు సచివాలయానికి దరఖాస్తుకు వెళ్ళగా ఈ కులానికి సంబంధించిన ఆప్షన్ ఆన్లైన్లో లేదని దరఖాస్తు తీసుకోలేమని సచివాలయ సిబ్బంది నిరాకరించారు. గత్యంతరం లేక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వ హించారు. ఈ మేరకు స్పందించిన తసశీల్దార్ గొడగలి కులస్తులను వెంటబెట్టుకొని ఈనెల 12న నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఎదుర్కొంటున్న సమస్యను ఆర్డీవో జయరాంకు వివరించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 19వ తేదీ నుంచి మండలంలో అన్ని సచివాలయాల్లో గొడగలి కులస్తులు దరఖాస్తుకు వీలుగా ఆప్షన్‌ను నమోదు చేయించారు. ఈ అవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని కోరారు.

లక్ష్యాలను అధిగమిద్దాం: "బోడపాటి" పిలుపు

విశాలాంధ్ర - నక్కపల్లి: అనుకున్న లక్ష్యాలను అధిగమించే దిశలో పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రతి ఒక్క జన సైనికుడు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలనుసారంగా భాగస్వాములు కావాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్తు పిలుపునిచ్చారు. ప్రతిష్టాత్మంగా ప్రారంభమైన జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో పదివేలు దాటి పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేసేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉన్నారని అందుకు సంబంధించి పాయకరావుపేట నియోజకవర్గంలో తన సారధ్యంలో 5000 దాటి సభ్యత్వం పూర్తి చేయనున్నామని చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులు మాజీ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ తోట నగేష్ సమక్షంలో జిల్లా పార్టీ నాయకులు ఆకేటి గోవిందరావు, కురుందాసు అప్పలరాజు, సేనాపతి బాబురావు లతోపాటు పలువురు సమక్షంలో 50 మంది జనసైనికులకు పార్టీ సభ్యత్వ నమోదు లింకును ప్రారంభించామన్నారు. అనంతరం తోట నగేష్‌తోపాటు పలువురు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు విక్కి స్వామి, పాము గణేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కోసూరు నాని బాబు, ఎలమంచిలి చంద్రరావు, జోగారావు, నక్కపల్లి రాజు, నాగరాజు, సాయి, కొల్లు గోవిందు, సత్తిబాబు, దమ్ము రాజు జిన్న, రాము, శంకర్, శ్రీను, బద్రి, అల్లు శివ తదితరులు ఉన్నారు.

వైభవంగా కొనసాగిన రుద్ర మహా యాగం

విశాలాంధ్ర - చోడవరం: అత్యంత మహిమాన్విత, చరిత్ర ప్రసిద్ధి చెందిన స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో ఒక్కటైన చోడవరం శ్రీ పురాణ గంగా సమేత గౌరీశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో చండీ సహిత శ్రీ రుద్ర మహా యాగం క్రతువుల్లో మూడవ రోజైన శుక్రవారం గణపతి పూజతో ప్రారంభమై యాగశాల, ఆలయ ప్రదక్షిణలు చేయించారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వర్యంలో "సర్వే జనా సుఖినోభవంతు" అంటూ నిర్వ హిస్తున్న రుద్ర మహా యాగంలో లక్ష్మీ పూజ, కుబేర వ్రతం, మన్యు పూజ, సూర్య నమస్కారాలు, సుబ్రహ్మణ్య వ్రతం, సామూహిక కుంకుమ అర్చనలు జరిపారు. కాకినాడ కు చెందిన ప్రముఖ వేద ఋత్వికులు బులుసు ప్రభాకర్ శర్మ, శ్రీపాద రాజశేఖర్‌ల పర్యవేక్షణలో వేద ఋత్వికులు రుద్ర మహా యాగంను ఘనంగా నిర్వహిస్తున్నారు. సర్వ మానవాళి శ్రేయస్సు కాంక్షించి తలపెట్టిన రుద్ర మహా యాగం మూడవ రోజుల ఘనంగా కొనసాగిందని నిర్వాహకులు, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేశారు.

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా మురళి

విశాలాంధ్ర - నర్సీపట్నం: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా పులిగా రామ్మోహన మురళి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాగరపు ఈశ్వర ప్రసాద్ నుండి ఉత్తర్వులు అందుకున్నానన్నారు. ఇటీవల విజయనగరంలో జరిగిన సమితి రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జాగరపు ఈశ్వర ప్రసాద్ ప్రతిపాదన మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించారని మురళి తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ సంవత్సరం పాటు పదవీకాలం ఉంటుందని, ప్రతి ఏడాది పాత కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం సమితిలో ఆనవాయితీగా వస్తుందన్నారు. చెరువులు రైతులకు ప్రాణాధారమని, అటువంటి చెరువుల పరిరక్షణ చేస్తూ, రైతులకు మేలు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. చెరువులు కబ్జాలకు గురైనట్లు గుర్తిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

వర్షాలతో అధికారులు అప్రమత్తం

విశాలాంధ్ర - యస్.రాయవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో వర్షాలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. వరహానది పరివాహక ప్రాంతాలు దార్లపూడి, సోముదేవుపల్లి, పెనుగొల్లు, ధర్మవరం, వమ్మవరం, యస్.రాయవరం, వెంకటాపురం, కర్రివానిపాలెం, బంగారమ్మ పాలెం గ్రామాల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వెంకటాపురం, సోముదేవుపల్లి గ్రామాల్లో తహశీల్దార్ జయలక్ష్మి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏఈలు దుర్గశంకర్, శ్రీనివాస్ భాను, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ ఏరువాక బోనస్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పాడిరైతుల శ్రేయస్సే హెరిటేజ్ డెయిరీ ధ్యేయమని మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. శుక్రవారం మండలంలో కోండకర్ల గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న 30 మంది పాడిరైతులకు ఏరువాక బోనస్ మేనేజర్ కూండ్రపు శేషు పంపిణీ చేశారు. అదేవిధంగా కొన్ని రోజులు క్రితం పాడిఆవు మృతి చెందడంతో పాడిరైతు సూరిశెట్టి భవానికి 40 వేలు బీమా అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ పాడిరైతులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడిరైతుల పశువులకు రాయితీపై కృత్రిమ గర్భాధారణ రూ.50, కృత్రిమ గర్భాధారణ (ఆడదూడ జన్మించుటకు) రూ.500కు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ, శ్రీను, జగ్గారావు, ధర్మరాజు తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

తాచేరు జలాశయంలో పూడికతీత పనులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం తాచేరు జలాశయం పరిధిలో గల ఆయకట్టు రైతులు పూడికపోయిన కాలువలను గత మూడు రోజులుగా స్వచ్ఛందంగా పూడికతీస్తున్నారు. ఈ కాలువలు మట్టితో పూడికపోయి సాగునీరు అందని విధంగా ఉండటంతో మాడుగుల, ఎం.కోడూరు గ్రామాలకు చెందిన రైతులు తమ పరిధిలో కాలువలలో మట్టిని పూడిక తీసి నీరు పారే విధంగా మార్గం సుగమనం చేస్తున్నారు. దీంతో ఆయకట్టు చైర్మన్ అప్పాన వెంకటరమణ, ఇరిగేషన్ అధికారులు, రైతులు పరిశీలించారు.

ఎన్టీపీసీ సీఎస్ఆర్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - పరవాడ: సామాజిక బాధ్యతలో బాగంగా ఎన్టీపీసీ చేపడుతున్న సీఎస్ఆర్ సేవలు అభినందనీయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పరవాడ ప్రభుత్వ జూనియర్ కాళాశాలలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ రోబోటిక్స్ ఇన్నోవేషన్ ల్యాబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా సంస్థ సీఎస్ఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, వివిధ విభాగాల అధికారులు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుండి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలో గొండుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వంటాకు శ్రీను, చోడవరం షుగర్ ఫ్యాక్టరీ పాలకవర్గం మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ టీడీపీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో మాడుగుల ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితర నాయకులు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గొండుపాలెం పాలసంస్థ డైరెక్టర్లు బండారు సూర్యనారాయణ, వంటాకు దేముడుబాబు, సాగునీటి సంఘం మాజీ డైరెక్టరు బండారు రామన్నపాత్రుడు, మాజీ ఉపసర్పంచ్ ఆదారి ఈశ్వరరావు, సీనియర్ నాయకుడు మద్దాల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీను, ఉమాశంకర్ మాట్లాడుతూ తమతోపాటు గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు సుమారు వంద మంది టీడీపీలో చేరారన్నారు. వంటాకు శ్రీను, దొగ్గ ఉమాశంకర్ టీడీపీలో చేరడం వల్ల గొండుపాలెం టీడీపీ అధ్యక్షుడు ఈర్లి దేముడుబాబు(నాయుడు), చౌడువాడ, ఎ.కోడూరు సర్పంచ్‌లు దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమైన అధికారులే రాకపోతే ఎలా...?

- సర్వసభ్య సమావేశంలో పీసీబీని ప్రశ్నించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సర్వ సభ్య సమావేశానికి ముఖ్యమైన అధికారులే రాకపోతే ఎలా అని పీసీబీ ఎనాలసిస్టుని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రశ్నించారు. కాలుష్య సమస్యపై అనేక ఫిర్యాదులు వస్తుంటే సంబంధిత అధికారులు దుమ్మా కొట్టడం తగదని సున్నితంగా మందలించారు. పరవాడలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి పంచకర్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం కావడంతో ముందుగా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచకర్ల మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం కోసం పాటు పడతానన్నారు. కాలుష్య నివారణ, పంచగ్రామల సమస్య, తాడి తరలింపు, ఉపాధి, తదితర సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు లేవ నెత్తిన సమస్యలను అధికారుల ద్వారా నివృత్తి చేయించారు. భూ కబ్జాలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. పెదముషిడివాడలో జరిగిన భూ కబ్జాలకు సంబంధించి మొత్తం వివరాలు సేకరించి తనకు అందజేయాలని రెవెన్యూ అధికారికి సూచించారు. మండలంలో కొనసాగుతున్న గ్రావెల్ క్వారీలపై ఆరా తీశారు. పరవాడ సర్వే నెంబర్ 11లోను, తాడి 116లోను రెండు క్వారీలకు అనుమతులున్నాయని, అలాగే మరో రెండు చోట్ల లంకెలపాలెం, ఈ.భోనంగి సమీపంలోని జగన్నాథపురం ప్రాంతాల్లో తాత్కాలిక అనుమతులలో మైనింగ్ జరుగుతోందని మైన్స్ రాయల్టీ ఎన్స్పెక్టర్ స్వాతి ఎమ్మెల్యేకు తెలిపారు. పెదముషిడివాడలో మాత్రం భారీగా అక్రమ మైనింగ్ జరిగిందని, దీనిపై అడపా దడపా పెనాల్టీలు విధించామని చెప్పుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇకపై ఎలాంటి అక్రమ మైనింగ్ జరగకూడదన్నారు. అవసరమైతే పోలీస్, రెవెన్యూ శాఖలతో కలిసి కట్టడి చేయాలని ఆదేశించారు. ఇక గంజాయిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ శాఖకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా న్యాయం జరిగేలా చూడాలని సీఐ బాల సూర్యారావుకి సూచించారు. ఇక పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు ఎస్సీ, శెట్టి బలిజల శ్మశాన వాటిక, ముస్లింల మసీదులకు స్థలం కేటాయించాలని కోరగా స్థల పరిశీలన చేయాలని ఎమ్మెల్యే రెవెన్యూకు సూచించారు. జాజులవానిపాలెం నుంచి పీఎస్ భోనంగి రోడ్డు విస్తరణకు నోచుకోలేదని భోనంగి సర్పంచ్ బండారు కల్పన అన్నారు. దీనిపై గతంలో ఎస్టిమేషిన్ చేసి టెండర్ పిలిచామని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని ఆర్ అండ్‌బి ఎఈ లలిత అన్నారు. తానాంలో గత నాలుగేళ్లుగా ఉపాధి పనులు ప్రారంభించలేదని, సమావేశాల్లో పదే పదే మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని, అయితే ఎన్నిల ముందు పనులను హడావిడిగా ప్రారంభించినప్పటికీ గ్రామ సర్పంచ్‌కు సమాచారం లేదని ఆ గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రోటోకాల్ తప్పకుండా పాటించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో కీర్తిస్పందన, తహశీల్దారు గణపతిరావు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతి

విశాలాంధ్ర - పరవాడ: మండల కేంద్రం పరవాడలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును కోరారు. ఈ మేరకు పరవాడలో శుక్రవారం ఆయన ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. పరవాడలో ఎన్టీపీసీ, ఫార్మాసిటీతో పాటు ఇండస్ట్రియల్ పార్క్‌లో గల కంపెనీల్లో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి ఈఎస్ఐ ఆసుపత్రి అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. గతంలో పరవాడలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేసి ఒక్కసారి కూడా తెరవలేదని వివరించారు. ఇప్పటికైనా నూతన రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వైద్య సేవల నిమిత్తం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని గనిశెట్టి కోరారు. మల్కాపురంలో ఉన్న ఈఎస్ఐ హాస్పిటల్‌లో బర్నింగ్ వార్డ్ ఏర్పాటు చేసి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని ఈఎస్ఐ ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు, ఈఎస్ఐ ప్రతి పరిశ్రమల్లో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని, ప్రతి ఈఎస్ఐ ఉన్న కార్మికుడికి సేవలు అందేలా చూడాలని గనిశెట్టి కోరారు.

భూములకు పట్టాలు మంజూరు చేయాలి



విశాలాంధ్ర - గొలుగొండ: కొయ్యూరు మండల పరిధిలో 70 సంవత్సరాల నుండి పంట భూములను సాగు చేసుకుంటున్న గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామానికి చెందిన రైతాంగానికి పట్టాలు మంజూరు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేసినట్టు బీజేపీ మండల అధ్యక్షుడు చందక గౌరి నాయుడు శుక్రవారం తెలిపారు. కొయ్యూరు మండలంలో బంగారం పేట, కొండ గోకిరి, కినపర్తి పంచాయతీలలో పంట భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు లేకపోవడం కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందే సహాయ సహకారాలు, అలాగే బ్యాంకుల నుండి ఎటువంటి పంట రుణాలు కూడా పొందలేకపోతున్నారని దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవాలని కోరారు.